క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గురుకుల విద్యార్థి ప్రతిభ



వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థికి నగదు బహుమతిని అందిస్తున్న అధికారులు

పెదపాడు: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థి కె శృతి రూపొందించిన ప్రాజెక్టు జూనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. దీంతో నిర్వాహకులు రూ.10వేల నగదు బహుమతిని అందించారు. ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి ప్రాజెక్టు రూపకల్పనకు కృషిచేసిన ఉపాధ్యాయురాలు కె అనిత, విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో బావాయిపాలెం పదోతరగతి విద్యార్థులు

నిడమర్రు: పదోతరగతిలో ఉత్తమ మార్కుల సాధనకు కష్టపడి చదవాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి కేవీఎస్ మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం నిడమర్రు మండలం బావాయిపాలెం ఉన్నత పాఠశాలలో ముత్యాల మురళి ఆర్థిక సహకారంతో ఎస్టీయూ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ గణపవరం, నిడమర్రు, పెంటపాడు మండలాల్లోని అన్ని ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు దాతల సహకారంతో స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం కేవీ కృష్ణకుమార్, ఉపసర్పంచ్ ముత్యాల కాశీ, ఎస్ఎంసి ఛైర్మన్ బొబ్బిలి గంగాధర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా పరిష్కార వేదికకు రెండు ఫిర్యాదులు

ఉంగుటూరు: ఎ.గోకవరం పంచాయతీలో 2024 వరకు నిర్వహించిన పనులు వివరాలు తెలియజేయాలని ఆ పంచాయతీ వార్డు మెంబరు తమ్మినీడి సత్యనారాయణ ప్రజాపరిష్కార వేదికలో సోమవారం ఎంపీడీవో మనోజుకి ఫిర్యాదు అందజేశారు. కోర్టులో కేసు నడుస్తుండగా అదే స్థలంలో ఒకరు అక్రమ నిర్మాణం చేస్తున్నారని నారాయణపురానికి చెందిన తల్లిబోయిన రమణ ఫిర్యాదు చేశారు. ఈవో పీఆర్డీ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

పెదపాడు: అప్పనవీడులోని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నరాల వ్యాధి బాధితురాలికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కృష్ణా జిల్లా బాపులపాడు కృష్ణానగర్‌కు చెందిన దూదిగం కనకారావు కుమార్తె హైమావతి నరాల వ్యాధితో బాధపడుతోంది. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం బాధితురాలికి ఆర్థికసాయం అందించారు.

నేడు దెందులూరులో రెవెన్యూ సదస్సు

దెందులూరు: గ్రామంలోని రైతులకు వ్యవసాయ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. ఈ నెల 7న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఎంఆర్ నగర్‌లోని గ్రామ సచివాలయం వద్ద గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామన్నారు.

కొల్లేరు రైతుల ఇక్కట్లు పట్టవా?

గణపవరం: కొల్లేరు పరిరక్షణపై జీవో- 120 ద్వారా రైతులు, ప్రజలు ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు పడుతుండగా కొత్తగా మరో పిడుగు లాంటి ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో రైతుల నెత్తిన మరో పిడుగు పడుతుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గణపవరం తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టరు ఆదేశాలమేరకు కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్‌ను ప్లస్ 5 కాంటూరు నుంచి 10 కిలోమీటర్లు మేరకు విస్తరించడానికి చేసిన ప్రతిపాదనలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు రైతులు ఇఎస్‌జెడ్ (ఎకో సెన్సిటివ్ జోన్) ప్రతిపాదనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గణపవరం, జగన్నాథపురం, చినరామచంద్రపురం, సరిపల్లె, కొత్తపల్లి గ్రామాల రైతులు, వివిధ పార్టీల నాయకులు, సర్పంచ్‌లు కూడా ఈప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలను తెలియచేశారు. ఈమేరకు వారు తమ అభిప్రాయాలను రాత పూర్వకంగా సమర్పించి, కలెక్టరు వారికి అందజేయాలని కోరారు. దీనిపై నిడమర్రు అటవీశాఖ అధికారి గంగారత్నం మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యం పరిధిలో ఉండే పక్షులు, జంతువులు మృత్యువాత పడకుండా కాపాడడానికే ఎకో సెన్సిటివ్ జోన్ (సున్నిత పర్యావరణ ప్రాంతం) ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. గణపవరం తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులపై చార్జీల బాదుడు

- నాడు కరెంటు బిల్లులు పెంచనన్నారు
- అధికారంలోకి వచ్చాక బాదుడే.. బాదుడు



విద్యుత్ సబ్‌స్టేషన్

దెందులూరు: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా అనేక సభల్లో విద్యుత్ బిల్లులు పెంచేది లేదని, పేద ప్రజలపై భారం పడనివ్వను..నన్ను నమ్మండి, కూటమి పార్టీకి అధికారం ఇవ్వండి అంటూ మాయమాటలు, అమలు సాధ్యం కాని హామీలిచ్చారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఆరు నెలల క్రితం రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. గద్దెనెక్కిన అనంతరం సీఎం చంద్రబాబు హామీలేవీ అమలు చేయకపోగా ఉన్న పెన్షన్లను కుదించుకుంటూ వచ్చారు. చంద్రబాబు మార్క్ రాజకీయాన్ని ఐదు నెలల్లోపే ప్రజలకు చూపించారు. ట్రూ అప్ బిల్లు పేరిట విద్యుత్ చార్జీలు పెంచేశారు. దీంతో గత ప్రభుత్వంలో ఉదాహరణకు రూ. 200 ఒక నెలకు విద్యుత్ బిల్లు వస్తే పెంచిన రేట్ల ప్రకారం రూ.450 నుంచి రూ.500 బిల్లు వస్తోంది. దాదాపు రూ.250 నుంచి రూ.300 వరకు కొన్నిచోట్ల అదనంగా బిల్లుల మోత మోగుతోంది.

దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లో 1,06,000 గృహ వినియోగదారుల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇసుక విధానం శాపంగా మారడం, పనులు లేకపోవడం, పెరిగిన విద్యుత్ బిల్లులు వారికి కొంతమేర జీవన విధానానికి గొడ్డలిపెట్టుగా మారింది. విద్యుత్ బిల్లుల భారంపై వినియోగదారులు గ్రామగ్రామాన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ట్రూ అప్ చార్జీలు

ఒక యూనిట్‌కు	45 పైసలు
1-30 యూనిట్ల వరకు	రూ.1.90
30-75 యూనిట్ల వరకు	రూ.3
75-125 యూనిట్ల వరకు	రూ.4.30
126-265 యూనిట్ల వరకు	రూ. 6
226-400 యూనిట్ల వరకు	రూ.8.70
400 యూనిట్ల పైన	రూ.9.75

ప్రజలను మోసం చేస్తున్నారు



ఎన్నికల ప్రచార సభల్లో విద్యుత్ చార్జీలు పెంచేది లేదని, పేదలపై భారం పడనివ్వని చంద్రబాబు చెప్పారు. ఆరు నెలలు కూడా ముగియక ముందే విద్యుత్ చార్జీలు పెంచారు. ఇది మోసం కాదా? పేదలపై విద్యుత్ బిల్లుల భారం పడింది. పేద ప్రజలందరూ బిల్లులు ఎలా కడతారు. పేదల ప్రయోజనాలు మీకు పట్టవా?

– కట్టా ఏసుబాబు, వినియోగదారుడు, దెందులూరు

చట్టబద్ధమైన సంస్థలు జోక్యం చేసుకోవాలి



ఎన్నికల ప్రచారంలో ప్రజలపై ఎటువంటి భారం లేకుండా చూస్తానన్నారు. ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలందరినీ దగా, మోసం చేయడమే. చట్టబద్ధమైన సంస్థలు జోక్యం చేసుకోవాలి. ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను సుమోటోగా తీసుకుని చర్యలు తీసుకోవాలని.

– వి.చందు, వినియోగదారుడు, పోతునూరు

గ్రాడ్యుయేట్ ఓటర్ల సంఖ్య 6,061

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో 6,061 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఇందులో ఉంగుటూరు మండలంలో 1,627 మంది, భీమడోలు మండలంలో 1,607 మంది, నిడమర్రు మండలంలో 950 మంది, గణపవరం మండలంలో 1,827 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని ఎన్నికల డీటీ పోతురాజు వివరించారు. ఎస్ఎస్ఆర్ 25 ముసాయిదా ప్రకారం ఉంగుటూరు నియోజకవర్గంలో సాధారణ నమోదైన ఓటర్లు 2,06,506 ఓటర్లు ఉన్నారని ఆయన తెలిపారు. పురుష ఓటర్లు 1.01 లక్షలు, 586 మంది, మహిళా ఓటర్లు 1,04,914 మంది ఓటర్లు ఉన్నారని డీటీ తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ఉంగుటూరు: ప్రభుత్వపథకాలను వేగవంతం చేయాలని అందుకు అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ సూచించారు. సోమవారం ఉంగుటూరు ఎంపీడీవో సమావేశపు హాలులో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు పంచాయతీ శాఖ ద్వారా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం, బీటీ రోడ్డు నిర్మాణం, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. వైద్యాశాఖ అధికారులతో సమస్యలపై సమీక్షించారు. పీఆర్ అసిస్టెంటు ఇంజనీరు కృష్ణమోహన్, ఏవో ప్రవీణ్ కుమార్, వెలుగు ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు



గుండుగొలనులో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన కార్యదర్శి కె.మురళి

భీమడోలు: గుండుగొలను శివారు ఆర్‌డబ్ల్యూఎస్ మంచినీటి ట్యాంకు వద్ద పంచాయతీ స్థలాన్ని అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామ పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసారు. ఈ స్థలాన్ని కొనుగోలు చేశామని, అందులో సువార్త ప్రార్థనలు నిర్వహించేందుకు శిలువను ఏర్పాటు చేసామని నిర్వాహకులు తెలిపారు. దీనితో ఆ ప్రాంతంలోని పలువురు తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేసారు. ఈ సమస్య పంచాయతీ అధికారుల దృష్టికి వెళ్లింది. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి, ఈ సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఈ ప్రాంతంలో ఎటువంటి అనుమతి లేనిదే మతపరమైన కార్యక్రమాలు నిర్వహించరాదని, నిర్లక్ష్యంగా వహిస్తే వారిపై ప్రభుత్వ నిబంధనల మేరకు లోబడి చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి మురళి హెచ్చరిస్తూ ఫ్లెక్సీను ఏర్పాటు చేసారు.

భీమడోలులో రోడ్డు ఆక్రమణలు తొలగించాలి



భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవికి ఫిర్యాదు అందజేస్తున్న పెద్దలు

భీమడోలు: భీమడోలు రైల్వేస్టేషన్ నుంచి సంతమార్కెట్ వరకు గల రోడ్డుకు ఇరువైపులా అక్రమణలు తొలగించాలని గ్రామ పెద్దలు సోమవారం తహసీల్దార్ బి.రమాదేవికి ఫిర్యాదు అందజేశారు. భీమడోలులో సోమవారం నిర్వహించిన మీకోసంలో వారంతా కలిసి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసారు. వచ్చే నెల 7 నుంచి మార్చి 9వ తేదీ వరకు భీమడోలులో జాతర జరుగుతుందని, దీనితో గ్రామంలో రద్దీ వాతావరణం నెలకొంటుందన్నారు. దీనితో ఇరుకుగాఉన్న రోడ్డులో వాహనదారులు రాకపోకలు సాగించడం చాలా కష్టమని, ఆక్రమణలు తొలగించాలని, తద్వారా రోడ్డు విశాలంగా ఉంటుందన్నారు. ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి బస్ సౌకర్యం కల్పించాలని పెద్దలు ఆదిరెడ్డి సత్యనారాయణ, పైడిమాల యుగంధర్, కుక్కల ప్రసాద్, దాసరి వీరాస్వామి తదితరులు మీకోసంలో ఫిర్యాదు చేసారు.

డిగ్రీ కాలేజీలో సంక్రాంతి సంబరాలు



డిగ్రీ కాలేజీలో రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు

గణపవరం: పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు పట్టుకొమ్మలని, వాటిని సంప్రదాయబద్ధంగా జరుపుకుంటూ వాటి ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. సోమవారం గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగులతో వేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్తమ రంగవల్లులకు బహుమతులు అందజేశారు. భోగి మంటలు, గొబ్బెమ్మలు, సంప్రదాయ వస్త్రాలంకరణలో విద్యార్థినీ విద్యార్థులు సందడి చేశారు. రకరకాల పిండి వంటలను అధ్యాపకులకు రుచి చూపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, అధ్యాపకులు సీహెచ్ చైతన్య, టి.అక్కిరాజు, కె.స్వరూపరాణి, జిశారదాదేవి, పర్వీన్, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: ఉంగుటూరు రైల్వే గేటు అవతల నీలాద్రిపురం రహదారి వెంబడి ఉన్న ప్రాంతంలో కొత్త స్తంభాలు నిర్మిస్తున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ శ్రీరామ్ తెలిపారు. ఉంగుటూరు మెట్ట ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదార్లు సహకరించాలని ఆయన కోరారు.

పంచాయతీ చెరువు మట్టి తరలింపుపై ఫిర్యాదు



పోలసానిపల్లిలో పొలాన్ని పంచాయతీ చెరువు మట్టితో పూడ్చి చదును చేస్తున్న దృశ్యం

భీమడోలు: పోలసానిపల్లి పంచాయతీ చెరువును తవ్వి ఆ మట్టిని నిబంధనలకు విరుద్ధంగా జగనన్న కాలనీలోని రైతు భరోసా కేంద్రానికి ఎదురుగా ఉన్న పొలంలో వేసి పూడ్చుతున్నారని, ఆ పనులను వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ పోలసానిపల్లి మాజీ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత అంబటి నాగేంద్రప్రసాద్ మీకోసంలో ఫిర్యాదు చేసారు. భీమడోలులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేసారు. ఈ పొలం ల్యాండ్ సీలింగ్‌లో నిరుపేదలైన 8 మందికి వ్యవసాయం చేసుకునేందుకు కేటాయించారని, అయితే లబ్ధిదారులకు సంబంధం లేని వ్యక్తులు పొలాన్ని పూడ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెండు రోజులుగా ట్రాక్టర్లతో మట్టి వేసి పొలాన్ని పూడ్చుతున్నారని తెలిపారు. అక్రమ మైనింగ్ చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పంచాయతీ పరిధిలోని మట్టిని తరలించుకునేందుకు అనుమతులు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామ కార్యదర్శి జయరామకృష్ణను వివరణ కోరగా గ్రామంలోని ఎక్కడా అక్రమంగా మట్టి తరలించడం లేదని, నిబంధనలకు మేరకు పనులు చేస్తున్నామన్నారు. గ్రామంలోని చెరువుల అక్రమణలు తొలగించి వాటిని పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. బుచ్చిరాజుగుంట చెరువులోని ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు.

చెరువు గట్టును పటిష్టం చేయాలి

పోలసానిపల్లిలోని అక్రమణలకు గురైన చెరువులను గుర్తించి వాటి గట్టు చుట్టూ మట్టిపోసి పటిష్టపర్చేందుకు చర్యలు తీసుకోవాలని పోలసానిపల్లి ఎంపీటీసీ అంబటి దేవి కోరారు. చెరువుల్లోని మట్టిని తరలించి అక్రమ ల్యాండ్ సీలింగ్ భూములను పూడ్చేందుకు వినియోగించరాదని పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోలేదని సోమవారం తెలిపారు. గ్రామంలోని బుచ్చిరాజు కుంటలో ఆక్రమణలు సోమవారం తొలగిస్తున్నట్లు అధికారులు చెప్పారని, శని, ఆదివారం రాత్రి సమయాల్లో అదే చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలించారని ఆమె ఆరోపించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దృష్టికి తీసుకెళ్తామన్నారు. చదును చేసిన పొలాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని స్థలాలుగా విభజించి నిరుపేదలకు ఇవ్వాలని ఆమె కోరారు.

అలరించిన శ్రీ కృష్ణ రాయబారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్ర నామ పారాయణ, స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి సాయంకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు మాగిపూడి వాణిశ్రీ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుంచి తెనాలికి చెందిన నోరి నారాయణ మూర్తి శ్రీ వేంకటేశ్వర వైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 8 గంటల నుంచి శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటకం భక్తులను విశేషంగా అలరించింది. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రైతుల అనుభవాలను విద్యార్థులతో పంచుకోవాలి



భోగాపురంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పెదవేగి : రైతులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకోవాలని ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె. ఫణికుమార్ అన్నారు. పెదవేగి మండలం భోగాపురం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం రైతు సదస్సును నిర్వహించారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థ మార్కాపురం ఎస్.ఎస్. వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయంలో తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవాలని రైతులకు ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఫణికుమార్ తెలిపారు. రైతు సదస్సులో భాగంగా విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త ఎస్.నాగేంద్ర బాబు, ఎస్ఎస్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి, ఎస్ఎస్ వ్యవసాయ కళాశాల ఏడీఆర్ రవి తేజ, పెదవేగి ఏఓ ప్రియాంక, పెదపాడు ఏఓ ప్రవీణ్, భోగాపురం సర్పంచ్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఉంగుటూరు రైల్వే గేటు మూసివేత

ఉంగుటూరు: ఉంగుటూరు రైల్వే గేటు మూసివేశారు. ఈగేటు మరమ్మతుల నిమిత్తం వారంరోజుల పాటు మూసి వేయనున్నారు. సోమవారం మధ్యాహ్నం గేటను మూసి వేశారు. 12వ తేదీ వరకు మూసి వేసి ఉంచుతారు. ఎపుడూ రద్దీగా ఉండే గేటు మూసి వేయడం వల్ల ఎగువనున్న నీలాద్రిపురం, కొత్తగూడెం, నాచుగుంట, ఉంగుటూరు మెట్టప్రాంతంలోని ప్రజలు, ఉంగుటూరు ఇండస్ట్రీకి వెళ్లే కార్మికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండునెలల క్రితం గేటు మూసివేసి మరమ్మతులు చేశారని, మళ్లీ ఇప్పుడు మరమ్మతులు అంటున్నారని ప్రజలు వాఖ్యానిస్తున్నారు. దీనివల్ల చుట్టూ తిరిగి నాచుగుంట గేటు నుంచి ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని వారు వాపోయారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టు శిక్షణ



కుట్టు శిక్షణను ప్రారంభించిన దృశ్యం (ఫైల్ ఫొటో)



మహిళలకు కుట్టు శిక్షణలో వివిధ రకాల మోడల్స్ నేర్పిస్తున్న దృశ్యం

- ఏలూరు విజన్ లయన్స్, అమ్మ అసోసియేషన్ ప్రెసిడెంట్ చుక్కా అవినాష్‌రాజ్
- ఉచితంగా కుట్టు శిక్షణ, సబ్సిడీపై మిషన్ అందజేత

పెదవేగి : గ్రామీణ పేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అనంతరం మిషన్లు పంపిణీ చేయడంతో వారంతా సుశిక్షితులైన దర్జీలుగా మారి ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ గ్యాట్ ఛైర్‌పర్సన్, అమ్మ అసోసియేషన్ ప్రెసిడెంట్ చుక్కా అవినాష్‌రాజ్ అన్నారు. పెదవేగి మండలం జానంపేటలో ఏడవ మైలు రాయి వద్ద సెయింట్ ఫాదర్ పియో చర్చి కాలనీలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని జూన్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ఏలూరు విజన్ లయన్స్ క్లబ్, ఆరోగ్య మేరీమాత అసోసియేషన్ (అమ్మ) సంయుక్త ఆధ్వర్యంలో చుక్కా అవినాష్‌రాజ్ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేశారు. ఆరు నెలలపాటు టీచర్ ఎల్లమెల్లి జ్యోతి కుట్టు శిక్షణ అందించారు. 43 మంది పేద, మధ్యతరగతి మహిళలకు శిక్షణనిచ్చి 50 శాతం సబ్సిడీతో మిషన్లు అందించారు. ఈ శిక్షణ గ్రామీణ ప్రాంత మహిళల జీవనోపాధికి ఎంతగానో ఉపయోగకరంగా మారింది.

ఉచితంగా కుట్టు శిక్షణ



నా భర్త ఏడేళ్ల క్రితం చనిపోయారు. పాప, బాబు, ఉన్నారు. చిరు వ్యాపారం చేసుకుంటూ అప్పులు తీర్చుకుంటూ జీవనం గడుపుతున్నా. ఉచితంగా కుట్టు శిక్షణ శిక్షణ నేర్పించడం నాకు ఎంతగానో ఉపయోగపడింది. 50 శాతం సబ్సిడీతో మిషన్ ఇస్తున్నారు.

– మడతల వెళాంగిణి, జానంపేట

ఆర్థికాభివృద్ధి సాధిస్తా



బోన్ క్యాన్సర్‌తో గతేడాది నా భర్త చనిపోయా రు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్న దుకాణం ఏర్పాటు చేయడంతోపాటు మహిళల దుస్తులు కుట్టుకుందామన్న ఆశతో శిక్షణకు వచ్చాను. ఈ శిక్షణలో ఆడ పిల్లలకు సంబంధించి అన్ని రకాల దుస్తులు కుట్టడం నేర్పించారు. దీంతో ఆర్థికాభివృద్ధిని సాధించాలని అనుకుంటున్నారు.

– మిరియాల పుష్పలత, ప్రకాష్‌నగర్

శిక్షణ చాలా బాగా ఉపయోగపడింది



మాది చాలా పేద కుటుంబం. వ్యవసాయ కూలి పనికి వెళుతూ జీవనం గడుపుతున్నాం. విభిన్న ప్రతిభావంతుడైన 15 ఏళ్ల కుమారుడున్నాడు. అతన్ని చూసుకుంటూ పిల్లలకు ప్రైవేటు చెబుతున్నాను. ఉచిత కుట్టు శిక్షణ ఉపాధికి చాలా బాగా ఉపయోగపడుతోంది.

– చిన్నం నాగరత్నం, బి శింగవరం

గ్రామీణ పేదల అభ్యున్నతికి కృషి



గ్రామీణ పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి క్షేత్రస్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ కృషి చేస్తున్నాను. ఇలా ఇప్పటికే 30 బ్యాచ్‌ల వరకు కుట్టు శిక్షణ అందించాం. వెయ్యి మందికి పైగా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ నేర్పించి, 50 శాతం సబ్సిడీతో మెషీన్లు అందించాం.

– చుక్కా అవినాష్‌రాజ్, అమ్మ అసోసియేషన్ ప్రెసిడెంట్, పెదవేగి

శ్రీవారి ఆలయంలో వైభవంగా ధనుర్మాసోత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాలు శ్రీవారి వైభవాన్ని చాటుతున్నాయి. నిత్యం ఆలయంలో సుప్రభాత సేవకు బదులు, తిరుప్పావై పాశురాలను పఠిస్తున్నారు. స్వామివారి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన శ్రీవారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, విశేష పుష్పాలంకారాలు చేశారు. పూజల అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అశ్వ, గజ సేవలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు.